సాక్షి బాపట్ల

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



మ్యూజియంలో స్వచ్ఛభారత్

అమరావతి: స్థానిక పురావస్తు మ్యూజియంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రారంభించారు. మ్యూజియం ఇన్‌చార్జి చినబాబు మాట్లాడారు.



రథయాత్రకు విశేష స్పందన

భట్టిప్రోలు: శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి రథయాత్రకు విశేష స్పందన లభించింది. టీటీడీ నుంచి ఏర్పాటు చేసిన రథయాత్ర శనివారం భట్టిప్రోలు చేరుకుంది.



విద్యార్థినుల ర్యాలీ

గుంటూరుఎడ్యుకేషన్ : జేకేసీ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం సందర్భంగా విద్యార్థినులు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రూపుదిద్దుకుంటున్న జగనన్న కాలనీలు

జిల్లాలో 19 మండలాల్లో 31,167 గృహాలు మంజూరు

- ఇప్పటికే 10,654 పూర్తి
- వివిధ దశల్లో మిగిలినవి
- అర్బన్ ప్రాంతాల్లో మరింత వేగంగా నిర్మాణం
- వేటపాలెం, బాపట్ల ప్రాంతాల్లో ప్రారంభానికి సిద్ధం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వేటపాలెంలో జగనన్న కాలనీ

సాక్షి ప్రతినిధి,బాపట్ల: నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంతో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ పక్కా గృహాలను నిర్మించి ఇస్తోంది. తొలుత సొంతంగా ఇంటి స్థలాలు కేటాయించి ఆ తరువాత పక్కాగృహాలు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక, సిమెంట్, ఇనుముతోపాటు అన్నిరకాల సామగ్రిని అందిస్తోంది. కాలనీల్లో తాగునీరు, ఉచిత విద్యుత్, రహదారులతోపాటు మౌలిక వసతులను ఏర్పాటు చేస్తోంది. దీంతో దశాబ్దాలుగా ఇళ్లులేని పేదల సొంతింటి కలను ప్రభుత్వం సాకారంచేస్తోంది. పేదల పక్కా గృహాల నిర్మాణం జిల్లాలో శరవేగంగా సాగుతోంది. కలెక్టర్ రంజిత్ బాషా ప్రత్యేక శ్రద్ధతో అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసి గృహనిర్మాణ పనులను మరింత వేగవంతం చేశారు. జిల్లాలో బాపట్ల, అద్దంకి, చీరాల, పర్చూరు, రేపల్లె, వేమూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 19 మండలాల పరిధిలో ప్రభుత్వం 31,167 పక్కా గృహాలను మంజూరు చేసింది. వాటిల్లో ఇప్పటికే దాదాపు 11 వేల గృహాల నిర్మాణం పూర్తిచేశారు. మిగిలిన గృహాల నిర్మాణం వేగంగా సాగుతోంది. ప్రధానంగా బాపట్లతోపాటు అర్బన్ ప్రాంతాల్లో గృహాల నిర్మా ణం శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే పలు జగనన్న కాలనీలలో గృహాల నిర్మాణం పూర్తికాగా పలువురు పేదలు గృహప్రవేశాలు చేశారు. వీటితోపాటు మరికొన్ని జగనన్న కాలనీల నిర్మాణం పూర్తికాగా మొదటి దశ ఐదు లక్షల గృహాల ప్రారంభోత్సవంలో భాగంగా ప్రభుత్వం ఆ కాలనీలను ప్రారంభించనుంది. జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టి అన్నిశాఖల అధికారులను సమన్వయం చేస్తూ గృహనిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీధర్ వరుస సమీక్షలతో అధికారులను పరుగులు పెట్టించారు. గృహనిర్మాణశాఖ పీడీ ప్రసాద్ క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షిస్తూ త్వరితగతిన గృహాల నిర్మాణం పూర్తయ్యేలా చూస్తున్నారు. దీంతో బాపట్ల జిల్లాలో మిగిలిన జిల్లాలతో పోలిస్తే పేదల గృహనిర్మాణ పనులు మరింత వేగంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా అర్బన్ ప్రాంతంలో మిగిలిన జిల్లాల కంటే పనులు మరింత వేగంగా జరుగుతున్నాయి. తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు 5 లక్షల గృహాలను ప్రారంభించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయించడంతో జిల్లాల వారీగా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు లక్ష్యాలను నిర్దేశించారు. దీనిలో భాగంగా బాపట్ల జిల్లాలో లక్ష్యాలకు మించి గృహాలనిర్మాణం పూర్తి చేశారు. గృహాల నిర్మాణంతో పాటు పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా, తాగునీరు, రహదారుల సౌకర్యం తదితర మౌలిక వసతులు కల్పించారు.



అద్దంకిలోని జగనన్న కాలనీ

మోడల్ కాలనీలు ఎంపిక

మోడల్ కాలనీలను ప్రారంభించాలని రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి ఆదేశాలు రావడంతో జిల్లా అధికారులు వేటపాలెం వద్ద చల్లారెడ్డిపాలెం-2, దేశాయిపేట-1, పందిళ్లపల్లి, రామన్నపేట, పుల్లరిపాలెం తదితర ప్రాంతాల్లో మొత్తం 283 గృహాలతో నిర్మిస్తున్న కాలనీలను ఎంపిక చేశారు. ఇందులో ఇప్పటి వరకు దాదాపుగా గృహాలనిర్మాణం పూర్తిచేశారు. కాలనీల్లో అన్ని వసతులు కల్పించారు. దీంతో ఆయా కాలనీల్లోని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సొంతింటి కల నెరవేరింది



ఆటోనడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. అద్దె ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నా. సొంతింటి కోసం పదహారేళ్లుగా ఎదురు చూస్తున్నా. ఈ ప్రభుత్వం స్థలంతోపాటు ఇళ్లు మంజూరుచేసింది. ఇంటి నిర్మాణానికి ఇసుక ఉచితంగా ఇచ్చారు. కరెంట్ ఉచితంగా ఇచ్చారు. ఇళ్లు నిర్మించుకొని ఇంట్లో చేరాం. చాలా సంతోషంగా ఉంది. జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉన్నాం.

– ఆట్ల పోలిరెడ్డి, రామన్నపేట, వేటపాలెం మండలం

మౌలిక వసతులు కల్పిస్తున్నాం



ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇళ్లు నిర్మించి వారి సొంతింటి కలను నెరవేరుస్తోంది. జిల్లాలో 31,167 ఇళ్లను మంజూరు చేసింది. ఇప్పటికే 11వేలకు పైగా గృహాలను నిర్మించాం. మిగిలిన గృహాల నిర్మాణం వేగంగా సాగుతోంది. అర్బన్ ప్రాంతాల్లో గృహనిర్మాణం మరింత వేగంగా జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ వేగవంతం చే సేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నాం.

– రంజిత్ బాషా, కలెక్టర్, బాపట్ల జిల్లా

లక్ష్యాల మేరకు పనులు



బాపట్ల జిల్లాకు ప్రభుత్వం 31,167 గృహాలు మంజూరుచేసింది. వీటిలో ఇప్పటి వరకు 11 వేల గృహాల నిర్మాణం పూర్తయింది. మిగిలిన గృహాల నిర్మాణం వేగంగా సాగుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు గృహాల నిర్మాణం జరుగుతోంది.

–జీవీఎస్‌ఆర్‌కె ప్రసాద్, పీడీ, గృహనిర్మాణశాఖ

ప్రతి ఒక్కరికీ న్యాయ అవగాహన ఉండాలి

న్యాయమూర్తి జి.వాణి



బాపట్ల: ప్రతి ఒక్కరికీ న్యాయ అవగాహన ఉండాలని న్యాయమూర్తి జి.వాణి పేర్కొన్నారు. బాపట్లలోని పాలిటెక్నిక్ కళాశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నిషేధం మీద, న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి మాట్లాడుతూ ర్యాగింగ్ వంటి కార్యక్రమాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. లైంగిక వేధింపులకు పాల్పడకూడదని చెప్పారు. క్షణావేశాలకులోనై క్రిమినల్ చరిత్రను సృష్టించుకోవద్దని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రుక్మిణి, బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.లీలాకృష్ణ, న్యాయవాదులు వూట్ల రామారావు, సిహెచ్.రామాంజనేయులు, బండి రామ్మూర్తి, ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ పి.సందీప్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎండీ రఫీ, ప్రిన్సిపాల్ టి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం చేసే ప్రదేశాల్లో గస్తీ ముమ్మరం

బాపట్లటౌన్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సమస్యాత్మక ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ వకుల్‌జిందాల్ సిబ్బందిని ఆదేశించారు. ఎస్పీ శనివారం ఓ ప్రకటన చేస్తూ.. జిల్లావ్యాప్తంగా 1071 వినాయక విగ్రహాలను ఏర్పాటుచేశారన్నారు. నిమజ్జనం చేసే 188 ప్రదేశాల్లో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 22 వరకు మొత్తం 568 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు తెలిపా రు. బాపట్ల జిల్లాలోని సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్‌లతోపాటు సముద్ర తీరం వెంబడి నిమజ్జనాలు జరిగే ప్రదేశాలలో గజ ఈతగాళ్లను నియమించామన్నారు. సముద్రంలో నిర్దిష్ట లోతును గుర్తించి ఆ ప్రదేశాన్ని దాటి లోపలికి వెళ్లకుండా చూస్తున్నామన్నారు.

న్యూస్‌రీల్

పాలక మండలికి దరఖాస్తు చేసుకోండి

అమరావతి: అమరావతిలోని అమరేశ్వరస్వామి దేవస్థానం వ్యవస్థాపకేతర పాలకమండలి సభ్యుల నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపీనాథశర్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలకమండలి సభ్యత్వంపై ఆసక్తి ఉన్న వారు వచ్చేనెల 12వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసేవారు తప్పనిసరిగా హిందువులై ఉండాలన్నారు. మిగిలిన వివరాలకు దేవాలయ కార్యాలయంలో పని వేళలలో సంప్రదించాలన్నారు.

నేడు తెనాలికి వందేభారత్ రైలు

తెనాలిరూరల్: వందే భారత్ రైళ్లను ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. చెన్నై-విజయవాడ వందే భారత్ రైలుకు తెనాలిలో హాల్ట్ కల్పించారు. ఈ నేపథ్యంలో రైలుకు స్వాగతం పలికేందుకు అధికారులు ఏర్పాట్లుచేశారు. తెనాలి రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఉదయం 11.40 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని స్టేషన్‌మేనేజర్ టీవీ రమణ శనివారం తెలిపారు. ప్రజలందరూ వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

జిల్లాలో ఆశాజనకంగా వర్షం




నరసరావుపేట: నరసరావుపేటలో శుక్ర, శని వారాలలో వర్షం కురిసింది. మెట్ట పంటకు కావాల్సిన వర్షం కురిసిందని రైతులు తెలియజేస్తున్నారు. నరసరావుపేటలో ఈనెల మొత్తంపై 12.77 సెం.మీ వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటివరకు 10.94 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో వర్షం కురిసింది. జిల్లాలోని 28 మండలాలకుగాను 16 మండలాల్లో ఈనెల సాధారణ వర్షపాతం మించి నమోదైంది.

నేటి నుంచి నృసింహుని పవిత్రోత్సవాలు



మంగళగిరి : శ్రీలక్ష్మీ నృసింహస్వామి పవిత్రోత్సవాలు ఆదివారం ఉదయం అకల్మష హోమంతో ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈఓ రామకోటి రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేరోజు సాయంత్రం విష్వక్సేనారాధన, అఖండ దీపారాధన, ఋత్విగ్వరణం, నవ కుంభారోహణ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 25, 26వ తేదీల్లో ప్రత్యేక పూజలు, పవిత్ర సమర్పణ నిర్వహించి చివరి రోజు 27వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు శ్వేత పుష్పాలంకార రథ గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి పవిత్రోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 4513 క్యూసెక్కులు విడుదల చేశారు.బ్యాంక్ కెనాల్‌కు 916, తూర్పు కెనాల్‌కు 90, పశ్చిమ కెనాల్‌కు 57, నిజాంపట్నం కాలువకు 65, కొమ్మమూరు కాల్వకు 2680 క్యూసెక్కులు విడుదల చేశారు.

ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ సేవలు

- రాష్ట్ర ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి అశోక్‌బాబు
- లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి పరామర్శ
- వంకాయలపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే తనిఖీ



క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారిని పరామర్శిస్తున్న ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి అశోక్‌బాబు

ఇంకొల్లు (చినగంజాం): రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వం పేదలకు కార్పొరేట్ వైద్య సేవలను అందిస్తుందని రాష్ట్ర ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి యాదల అశోక్‌బాబు అన్నారు. బాపట్ల జిల్లా ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఆసుపత్రిలోని రోగులకు అందుతున్న సేవలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని వివిధ విభాగాలైన లేబొరేటరీ, మందుల గది, ఓపీ గది, ఆపరేషన్ థియేటర్, అందులోని రికార్డులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకొల్లు గ్రామం పరిధిలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లబ్ధి పొందిన క్యాన్సర్, గుండె జబ్బులతోపాటు తదితర వైద్య చికిత్సలు చేయించుకున్న రోగులకు సంబంధించిన వివరాలను ఆయన తీసుకొని స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లక్షలు విలువైన ఆపరేషన్‌లు ఉచితంగా పొందామని, రవాణా చార్జీలు, భోజన ఖర్చులు అన్ని ప్రభుత్వమే ఇచ్చిందని లబ్ధిదారులు తెలిపారు. మందులు, రోగ నిర్ధారణ పరీక్షలు ఉచితంగానే చేశారని, వైఎస్సార్ ఆసరా కింద రూ.5 వేలు తమ బ్యాంకు అకౌంట్లలో వేశారన్నారు. ఈ పథకం వలన తాము బతికి బట్టకట్టామని వారు తెలియజేశారు.

లబ్ధిదారుల్లో సంతోషం..

ఇంకొల్లు గ్రామంలో ఈవింగ్స్ ఆర్కోమా వ్యాధితో బాధపడుతున్న ఎనిమిదేళ్ల చిన్నారి వాణి అఫ్రిన్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని విచారించారు. ఎన్నిసార్లు కీమోథెరపీ చేయించుకున్నది అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని తమ పాపకు ఉచితంగా అందించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలుపగా, జగన్ మామయ్యకు పాప శుభాకాంక్షలు తెలియజేయడం విశేషం. ఆరోగ్యశ్రీ ద్వారా గుండె ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న శివ సోమేశ్వరరావు ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ప్రభుత్వ నుంచి నగదు వెంటనే అందాయా లేదా అనే ఆయన విషయాన్ని విచారించారు. కార్పొరేట్ హాస్పిటల్ దగ్గరకు కూడా వెళ్లలేని నాలాంటి పేద వారికి సీఎం జగన్ లక్షల్లో ఖర్చయ్యే గుండె ఆపరేషన్‌ను చేయించారని సంతోషం వ్యక్తం చేశాడు. మా పాప విద్యాదీవెన ద్వారా ఆస్ట్రేలియాలో చదువుకుంటుందని, రైతు భరోసా ద్వారా కూడా లబ్ధి పొందామని తెలిపాడు. ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి అశోక్‌బాబు మా ఇంటికి వచ్చి పరామర్శించడం ఎంతో సంతోషంగా ఉందని సోమేశ్వరరావు అన్నారు. అనంతరం ఆయన వంకాయలపాడు గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అంజలి, సీహెచ్‌ఓ కోటేశ్వరరావు, సూపర్‌వైజర్‌లు మౌళి, ప్రభావతి, పీహెచ్‌ఎన్ సహస్ర, ఏఎన్‌ఎం ప్రశాంతి, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

పంట కాలువలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

ఐదుగురు విద్యార్థులకు స్వల్పగాయాలు



జరుబులవారిపాలెం వద్ద పంట కాలువలోకి దూసుకుపోయిన స్కూల్ బస్సు

కారంచేడు: విద్యార్థులతో వెళ్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సు ఎదురుగా వస్తున్న గేదెను తప్పించబోయి అదుపుతప్పి సమీపంలోని పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన కారంచేడు మండలంలోని జరుబులవారిపాలెం గ్రామ సమీపంలో శనివారం ఉదయం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. ఇంకొల్లుకు చెందిన ఒక ప్రైవేట్ స్కూల్ బస్సు కారంచేడు నుంచి విద్యార్థులతో స్వర్ణ, కేశవరప్పాడు మీదగా ఇంకొల్లు బయలుదేరింది. ఈ క్రమంలో బస్సు జరుబులవారిపాలెం సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా కొన్ని గేదెలు రావడంతో డ్రైవర్ వాటిని తప్పించే క్రమంలో కాలువలోకి జారిపోయింది. వెంటనే విద్యార్థులు కేకలు వేయడంతో సమీపంలోని గ్రామస్తులు వచ్చి వారిని క్షేమంగా బయటకు తీశారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 40 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులకు కాళ్లు, చేతులు, తలకు స్వల్ప గాయాలు కాగా ఇంకొల్లు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు హుటాహుటిన ఆస్పత్రికి వెళ్లారు. కారంచేడు పోలీసులు ఘటనా స్థలం వద్దకు వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సేవా దృక్పథానికి నిదర్శనంగా ఎన్‌ఎస్‌ఎస్

డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు



నాట్లు వేస్తున్న విద్యార్థులు

బాపట్ల : సేవా దృక్పథానికి నిదర్శనంగా ఎన్‌ఎస్‌ఎస్‌గా చెప్పవచ్చని వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా స్థానిక కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సమాజ సేవలో అంకితభావంతో భాగస్వాములు కావడానికి ఈ పథకం స్థాపించబడిందన్నారు. ప్రతి విద్యార్థి ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరవచ్చని, విద్యార్థుల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసాన్ని తీర్చిదిద్దడంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రధాన భూమిక వహిస్తుందన్నారు. విద్యార్థులు తమ సేవలను సమాజానికి నిరంతరాయంగా అందించడం ద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారన్నారు. విద్యార్థులతో వరినాట్లు వేయించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.లత, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, డాక్టర్ షేక్ హసీనా భాను, డాక్టర్ ఎస్.రత్న కుమారి, డాక్టర్ జి.శివనారాయణ, డాక్టర్ సి.సంధ్యారాణి, డాక్టర్ టి.వి. శ్రీధర్, డాక్టర్ ఎం.రమాదేవి, డాక్టర్ వి.జ్యోతి డాక్టర్ ఎం.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 524.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 11,858, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 853.50 అడుగుల వద్ద ఉంది.

లడ్డూ ప్రసాదం రూ.12.81లక్షలు



లడ్డూప్రసాదాన్ని వేలంలో దక్కించుకున్న బత్తుల రామారావు

నకరికల్లు: పల్నాడు జిల్లా దేచవరం గ్రామంలోని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని లడ్డూ ప్రసాదాన్ని రూ.12,81,000లకు బత్తుల రామారావు దక్కించుకున్నారు. గ్రామంలోని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర ప్రతిమ వద్ద 51 కేజీల లడ్డూప్రసాదాన్ని అలంకరించారు. శనివారం నిమజ్జనం సందర్భంగా స్వామివారి లడ్డూప్రసాదానికి ఉమ్మడి వేలం నిర్వహించారు. సుమారు 5గంటలపాటు ఉత్కంఠభరితంగా సాగింది. మొత్తం 10 మంది పోటీలో పాల్గొనగా ప్రధానంగా ముగ్గురి మధ్య పోటీ సాగింది. ఉత్కంఠభరితంగా సాగిన వినాయకుని లడ్డూప్రసాదం ఉమ్మడి వేలంలో బత్తుల రామారావు రూ.12.81లక్షలకు దక్కించుకున్నారు. కాగా ఇదే మండపం వద్ద లడ్డూప్రసాదాన్ని గతేడాది రూ.5.16లక్షలకు పాడడం మరో విశేషం. భక్తసంఘం వారు మాట్లాడుతూ లడ్డూప్రసాదం వేలంలో వచ్చిన మొత్తాన్ని ఈ ఏడాది ఉత్సవ ఖర్చులు మినహాయించి మిగిలిన మొత్తాన్ని స్వామివారి ప్రయోజనానికి వినియోగిస్తామని తెలిపారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

బాపట్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేపల్లెలోని స్కిల్ హబ్ సెంటర్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ఏబీఆర్ గవర్నర్‌మెంట్ డిగ్రీ కళాశాల్లో శిక్షణ ఉంటుందని, ఆన్‌లైన్‌లో కూడా శిక్షణ ఇవ్వటం జరుగుతుందని చెప్పారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డవలప్‌మెంట డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, స్టోర్ అసిస్టెంట్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని వివరించారు. వివరాలకు సి.హెచ్.రవి కుమార్ 9032384374ను సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్యంగా ఉంటేనే మెరుగైన సమాజం

- పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య రక్షణ అభినందనీయం
- గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా, కమిషనర్ కీర్తి

నెహ్రూనగర్ (గుంటూరు తూర్పు): ఉద్యోగులు, కార్మికులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే మెరుగైన సమాజం, అభివృద్ధి సాధ్యపడుతుందని, పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య రక్షణకు గుంటూరు నగర పాలక సంస్థ మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సఫాయి మిత్ర సురక్ష శివిర్‌లో భాగంగా పారిశుద్ధ్య, యూజీడీ కార్మికులకు బ్రహ్మానంద రెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంప్‌ను నగర కమిషనర్ కీర్తి చేకూరి, తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫాలతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పిన విధంగా ఉద్యోగులు ప్రభుత్వంలో కీలకమైన భాగమని, వారు ఆరోగ్యంగా ఉంటేనే ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత సమర్థవంతంగా అందుతాయన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో ముందుండే పారిశుద్ధ్య కార్మికులకు గుంటూరు నగర పాలక సంస్థ నిష్ణాతులైన వైద్యులతో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటీవల జిల్లా కలెక్టరేట్ లో ఉద్యోగులకు సుమారు 8750 వైద్య పరీక్షలు చేపట్టడం జరిగిందని, ఉద్యోగుల సమస్యల పరిష్కారనికి ప్రతి నెల 3వ శుక్రవారం ఎంప్లాయిస్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య రక్షణకు నగరపాలక సంస్థ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. గత 15 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా నగరపాలక సంస్థలో పని చేసే 3 వేల మంది పారిశుద్ధ్య, యుజీడీ కార్మికులకు నగరంలోని ప్రఖ్యాత వైద్యులతో వైద్య పరీక్షలు చేయిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా పేద బడుగులు ఉండే పారిశుద్ధ్య కార్మికులకు జీఎంసీ మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్మికులు ప్రతి ఒక్కరూ సమగ్ర వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్య పరీక్షల ఫలితాల మేరకు తగిన చికిత్స అందేలా నగరపాలక సంస్థ చర్యలు తీసుకోవాలని, ఇటువంటి క్యాంప్‌లు ప్రతి ఏటా జరిగేలా షెడ్యుల్ ఇవ్వాలని నగరపాలక సంస్థ అధికారులను కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు, ఆరోగ్య శ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ జయ రామకృష్ణ, డీటీసీఓ డాక్టర్ లక్ష్మా నాయక్, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, ఎస్ఈ భాస్కర్, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సి.హెచ్.శ్రీనివాస్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



బాధితుడికి చెక్కును అందజేస్తున్న ఎంపీ నందిగం సురేష్

ఉద్దండరాయునిపాలెం(తాడికొండ): గుండెకు బైపాస్ సర్జరీ చేసిన బాధితుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.8 లక్షల సహాయాన్ని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అందజేశారు. బాపట్ల టౌన్‌కు చెందిన పోలా చెన్నయ్య అనే బాధితుడు గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సకు రూ.12 లక్షలు ఖర్చు చేశాడు. ఆర్థికంగా స్థోమత లేని బాధితుడు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రెండు నెలల్లోనే రూ.8 లక్షల రూపాయలు మంజూరై బాధితుడికి చెక్కు వచ్చింది. శనివారం ఈ చెక్కును బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అందజేయడంతో బాధితుడు హర్షం వ్యక్తం చేశారు. ఆపదలో ఆపన్న హస్తం అందిస్తున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి ఈ సందర్భంగా బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.1.11 లక్షలు పలికిన లడ్డూ

తెనాలిఅర్బన్: శ్రీ గణేష్ భక్తబృందం ఆధ్వర్యంలో పుట్టా రాఘవయ్య రైస్ మిల్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. అక్కడ ఏర్పాటు చేసిన పెద్ద లడ్డూకు వేలంపాటలో రూ.1.11,000లు, చిన్న లడ్డూకు రూ.31 వేలు వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. పెద్ద లడ్డూను తొట్టెంపూడి నాగరాజు, మైలా నాగరాజు, చిన్న లడ్డూను జి.నరసింహారావు దక్కించుకున్నారు. అనంతరం ఊరేగింపుగా వినాయకుని ప్రతిమను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుంటూరు గోపి, చందు శ్రీనివాసరావు, కె.బాలాజీ, గోపాలరావు, శ్రీను, చందు, ఫణీ, తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల చెరువులో విషప్రయోగం

- రూ.లక్షల్లో నష్టపోయిన ఆక్వా రైతు
- పోలీసులకు ఫిర్యాదు



విష ప్రయోగంతో చనిపోయిన చెరువులోని రొయ్యలు

చినగంజాం: రొయ్యల చెరువులో విషప్రయోగం చేయడంతో ఓ ఆక్వా రైతు తీవ్రంగా నష్టపోయాడు. ఈ ఘటన శనివారం మండల పరిధి చినగంజాంలో చోటుచేసుకుంది. బాధితుడు కుక్కల శ్రీనివాస రెడ్డి అందించిన వివరాలు.. పెదగంజాంలో రెండెకరాల భూమిలో రొయ్యల చెరువుల సాగు చేపట్టాడు. ఇప్పటికి 55 రోజులు పూర్తి చేసుకొని 90 కౌంట్ ఉన్నట్లు తెలిపాడు. శుక్రవారం సాయంత్రం చెరువుకు సంబంధించిన మురుగు నీరు రొంపేరు కాలువకు పంపించే విషయమై కృష్ణారెడ్డి, అతడితో పాటు మరికొంతమందితో వివాదం చోటుచేసుకుంది. ఈవిషయమై శ్రీనివాసరెడ్డి వారిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదే రోజు రాత్రి 11 గంటలు సమయంలో రొయ్యల చెరువుల వద్ద కాపలాదారుడు శ్రీనివాసరెడ్డికి బైకులపై ముగ్గురు చెరువు దగ్గరకు వచ్చారని వారు ఎవరని హెచ్చరించడంతో వెళ్లిపోయారని ఫోన్ చేసి చెప్పాడు. శనివారం ఉదయం చెరువు దగ్గరకు వెళ్లి చూడగా చెరువులోని రొయ్యలు చనిపోయి కనిపించినట్లు ఆరోపించారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. సుమారు రూ.5 నుంచి రూ.6 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

ఎన్‌సీసీ ఫైరింగ్ క్యాంప్‌కు విద్యార్థి ఎంపిక



కాంపిటీషన్‌కు ఎంపికైన ఈశ్వర్ రంగరాజు

చీరాల రూరల్: స్థానిక సెయింట్ ఆన్స్ స్కూలు 9వ తరగతి విద్యార్థి పగడాల ఈశ్వర్ రంగరాజు ఎన్‌సీసీలో అరుదైన అవకాశం అందుకున్నాడు. 2023-24కి గాను తల్ సైనిక్ క్యాంపునకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ నుంచి ఆల్ ఇండియా ఎన్‌సీసీ ఇంటర్ డైరెక్టరేట్ ఫైరింగ్ కాంపిటీషన్‌కు ఎంపికైనట్లు ఎన్‌సీసీ ఆఫీసర్ గొర్ల గోపినాథ్ శనివారం తెలిపారు. నెల రోజులకు పైగా హైదరాబాదులోనే ఉంటూ కఠోర శిక్షణ తీసుకుంటున్నట్లు చెప్పారు. ఫైరింగ్ విభాగంలో ఎన్‌సీసీ క్యాడెట్‌ల మధ్య జరుగుతున్న ఫైరింగ్ కాంపిటీషన్‌లో రంగరాజు మంచి ప్రతిభ కనబరచి స్కూలుకు మన రాష్ట్రానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని స్కూలు ప్రిన్సిపాల్ జీనా జేవియర్, వైస్ ప్రిన్సిపల్ ఆరోగ్య మేరి, స్కూలు కరస్పాండెంట్ త్రీసా, పీఈటీలు విజయ నిర్మల, ధనుంజయ, ఆకాంక్షించారు.

కోల్డ్‌స్టోరేజ్‌ల స్టాకు వివరాలు ప్రతి నెల అందజేయాలి

మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ

కొరిటెపాడు(గుంటూరు): కోల్డ్ స్టోరేజీల యాజమాన్యం ప్రతి నెల స్టాకు వివరాలను విధిగా మార్కెట్ యార్డు అధికారులకు అందజేయాలని గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ ఆదేశించారు. మిర్చి దిగుమతిదారుల అసోసియేషన్, కోల్డ్ స్టోరేజీల అసోసియేషన్, కార్మిక సంఘాల నాయకులు, అధికారులతో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యార్డు చైర్మన్ రాజనారాయణ మాట్లాడుతూ యార్డు అధికారులు ఎప్పటికప్పుడు కోల్డ్‌స్టోరేజీలలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. మచ్చుకాయల నియంత్రణలో భాగంగా కోల్డ్‌స్టోరేజీల వద్ద ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, కోల్డ్‌స్టోరేజీల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాశరావు, సురేంద్రబాబు, మిర్చి దిగుమతిదారుల అసోసియేషన్ అధ్యక్షుడు లేళ్ల పెద అప్పిరెడ్డి, సాంబిరెడ్డి, కార్మిక సంఘం నాయకుడు శ్రీనివాసరెడ్డి, యార్డు అధికారులు శివారెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జారిపడి రైలుప్రయాణికుడు మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన దుగ్గిరాల రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు దుగ్గిరాల స్టేషన్ సమీపంలో పటాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సుమారు 25 నుంచి 27 ఏళ్ల మధ్య వయసున్న యువకుడు మృతి చెంది ఉండడం గుర్తించారు. మృతదేహాన్ని వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.